క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పద్మనాభం: పద్మనాభం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని రేవిడి ఫీడర్‌కు మరమ్మతులు చేపట్టనున్నందున పలు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖపట్నం జోన్ – 3 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కోరాడ, గెద్దపేట, లింగన్నపేట, బి.ఆర్.తాళ్లవలస, రేవిడి, రౌతులపాలెం, వెంకటాపురం, బుడ్డివలస, బర్లపేట, పాండ్రంగి, కొండ బర్లపేట, కురపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఈ గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

పేద విద్యార్థినికి చేయూత



దేవశ్రుతిని అభినందిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

మధురవాడ: ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించి ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో 440కి 431 మార్కులు సాధించిన నాగోతి దేవశ్రుతిని ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, మధురవాడకి చెందిన పలువురు పెద్దలు అభినందించారు. రేవళ్లపాలెం భూలోకమాత ఆలయం ఆవరణలో ఆమెతోపాటు తల్లిదండ్రులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె ఉన్నత చదువుల నిమిత్తం కార్పొరేషన్ చైర్మన్ శ్రీనివాసరావు రూ.5 వేలు, గ్రామ పెద్దలు శ్రీ బంగారుతల్లి భూలోకమాత సేవా సంఘం కమిటీ తరపున రూ.5 వేలు, వాండ్రాసి రవికుమార్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా బాలిక చదువుతున్న శ్రీవేద కళాశాల చైర్మన్ అక్కినాయుడు, కరస్పాండెంట్ ఎల్.లక్ష్మణరావు, డైరెక్టర్ జోగినాయుడు మాట్లాడుతూ బాలిక ఉన్నత చదువుల ఖర్చు తాము భరిస్తామని చెప్పారు.

నూకల లోడుతో వ్యాను బోల్తా



బోల్తా పడిన వ్యాను

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో ఆదివారం రాత్రి నూకల లోడుతో వ్యాన్ బోల్తా పడినట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి నూకల లోడుతో అనంతవరం మిల్లుకు వెళ్తున్న వ్యాన్ మార్గమధ్యలో పద్మనాభం జంక్షన్‌లో బోల్తా పడింది. అదేసమయంలో పద్మనాభం జంక్షన్‌లో అనంతవరం వెళ్లే రోడ్డు మీద జనం ఎక్కువగా ఉన్నారు. అటు వైపు వ్యాన్ వెళ్తే భారీగా ప్రాణ నష్టం జరిగి ఉండేది. బ్రేకులు పట్టకపోవడంతో డ్రైవర్ సమయస్ఫూర్తితో జనసంచారం లేని విజయనగరం రోడ్డు వైపు వ్యాన్‌ను తిప్పి బోల్తా కొట్టించాడు. దీంతో ఎవరికీ ఏ నష్టమూ జరగలేదు.

సీఎం జగన్‌పై దాడి అమానుషం

మధురవాడలో నల్ల రిబ్బన్లతో నిరసన



నరసింహస్వామి ఆలయ ముఖద్వారం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న నాయకులు



భీమిలి మెయిన్ రోడ్డుపై ఆందోళన చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మధురవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస్సు యాత్రకి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు కుట్రలు పన్నడమే కాకుండా రాళ్లదాడికి పూనుకోవడం అమానుషమని జీవీఎంసీ 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, ముదుండి రాజేశ్వరి, తదితరులు అన్నారు. ఆదివారం సాయంత్రం మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ మాస్టర్ ప్లాన్ రోడ్డులో గాంధీ విగ్రహం వద్ద నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి పార్టీలు ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడి వారి పతనాన్ని వారే కొని తెచ్చుకుంటున్నారన్నారు. హద్దు మీరితే తాము కూడా ధీటుగా సమాధానం ఇస్తామంటూ హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులు ఎవ్వరూ సహించరని, చేతనైతే ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలి తప్ప ఇలాంటి చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎం.జ్యోతిర్మయి, జేసీఎస్ కన్వీనర్ ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, ఆశాజ్యోతి, కె.కళ్యాణి, పేడాడ చక్రపాణి, కె.రాజు, వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ప్రజలే బుద్ధి చెబుతారు

భీమునిపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడికి నిరసనగా వైఎస్సార్ సీపీ జీవీఎంసీ 3వ వార్డు అధ్యక్షుడు అల్లిపిల్లి నర్సింగరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భీమిలి మెయిన్ రోడ్డుపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు యాత్రలో ఊహకందని విధంగా ప్రజలు తండోపతండాలుగా రావడంతో టీడీపీ నాయకులు సహించలేక దాడులు చేయిస్తున్నారన్నారు. ఇది అత్యంత హేయమైన చర్యని, దాడి జరిగితే మానవత్వం ఉన్నవారు ఎవరైనా సానుభూతి చూపుతారని, టీడీపీ శ్రేణులు మాత్రం అవహేళన చేస్తూ విమర్శలు చేస్తున్నాయన్నారు. త్వరలో ప్రజలు వీరికి గట్టిగా బుద్ధి చెబుతారన్నారు. ఎవరు ఎలా విమర్శించినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డే మరోసారి ముఖ్యమంత్రి అవుతారన్నారు. నాయకులు ఎస్.కరుణాకరరెడ్డి, అక్కరమాని రాము నాయుడు, వాసుపల్లి కొండబాబు, కదిరి ఎల్లాజీ, జి.మధునాయుడు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, ఆర్.ప్రభాకర్‌నాయుడు, ఎ.సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

యువజన విభాగం ఆధ్వర్యంలో..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో పురాతన నర్సింహస్వామి ఆలయ మెట్ల మార్గం ముఖ ద్వారం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.ప్రభాకర్‌నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు బింగి హరికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న ముఖ్యమంత్రిపై కుట్రతో దాడి చేయడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, ఎన్ని ఆటంకాలు వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. నాయకులు అప్పికొండ కృష్ణ, ప్రగడ చంటి, రాజశేఖర్, గౌరీశంకర్, శ్రీను, జగదీష్ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు పట్టం కట్టండి



కొండవాలు ప్రజలను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తాటిచెట్లపాలెం: భీమిలి నియోజకవర్గ ప్రజలకు మరోసారి మంచి చేయడానికి గెలుపే లక్ష్యంగా మీ ముందుకు వస్తున్నానని వైఎస్సార్‌సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు పట్టం కట్టాలని కోరారు. భీమిలి జోన్ పరిధి 45వ వార్డు సత్యసాయినగర్, వరాహగిరి కాలనీ-1, 2, గణేష్‌నగర్ తదితర కొండవాలు ప్రాంతాల్లో ఆదివారం కార్పొరేటర్ కంపా హనోకు, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఆయా కాలనీల నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో జై జగన్.. జై అవంతి అంటూ మహిళలు మంగళ హారతులతో జేజేలు పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించుకోవాలని ముత్తంశెట్టి పిలుపునిచ్చారు. జగనన్న ఆశీర్వాదంతో ఈ ప్రాంతాల్లో సుమారు రూ.1.68 కోట్లతో అభివృద్ధి పనులు చేయించగలిగానన్నారు. స్థానిక నాయకులు కారుకొండ రాజు యాదవ్, సింగంపల్లి బాబూరావు, నానిబాబు, హరిపట్నాయక్, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పాల్గొన్నారు.

రూ.4 లక్షలతో ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు



ఆర్‌వో ప్లాంట్ ప్రారంభిస్తున్న పోతిన నగేష్, తదితరులు

మధురవాడ: మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో గల ఎస్ఎఫ్ఎస్ చర్చికి పోతిన నాయుడు బాబు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పోతిన నగేష్ రూ.4 లక్షల వ్యయంతో ఆర్‌వో కూలింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇక్కడ టీవోఆర్ గురువులు నిర్వహిస్తున్న చర్చి ఆవరణలో భక్తులతోపాటు ఎస్ఎఫ్ఎస్ స్కూలు విద్యార్థుల కోసం దీనిని ఏర్పాటు చేశారు. ముందుగా చర్చిలో ఫాస్టర్ ప్రకాశ్ ఆధ్వర్యంలో నగేష్, హాసిని, తదితరులు ప్రార్థనలు చేశారు. అనంతరం నగేష్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా చేపట్టే సేవా కార్యక్రమాల్లో భాగంగా దీనిని సమకూర్చినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఇక్కడ 400 మంది క్రైస్తవులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. పలువురు విశ్వాసులు, క్రైస్తవ మత పెద్దలు పాల్గొన్నారు.

గురుకులానికి సామగ్రి అందజేత



గురుకులానికి సామగ్రి అందజేస్తున్న స్టేట్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది

మధురవాడ: కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కి విశాఖపట్నం మాడ్యూల్ స్టేట్ బ్యాంకు ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సీఎస్ఆర్ నిధులతో సుమారు రూ.1 లక్ష విలువ చేసే సామగ్రి అందజేశారు. ఎస్‌బీఐ విశాఖపట్నం అడ్మినిస్ట్రేషన్ జనరల్ మేనేజర్లు ఫణికొండలరావు, బీఎస్‌వీ రమణ, అసోసియేషన్ ప్రతినిధులు సీహెచ్ వికాస్, గోవిందరాజు, తదితరులు 2 బీరువాలు, చార్జింగ్ లైట్లు, కుర్చీలు, సౌండ్ సిస్టమ్, తదితర సామగ్రిని విశాఖ, అనకాపల్లి జిల్లాల గురుకుల డీసీవో ఎస్.రూపావతి, ప్రిన్సిపాల్ టి.నాగమణి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖకి చెందిన బోని సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి సతీమణి సూర్యకాంతం గత విద్యా సంవత్సరం టాపర్స్ ముగ్గురు విద్యార్థినులకు నగదు బహుమతి అందజేసి ప్రోత్సహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.నవనీత వాణి, శ్రీలక్ష్మి, శ్రీకాంతి, హృదయ మేరి, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ



చిట్టివలస అగ్నిమాపక కేంద్రంలో రోల్‌కాల్ నిర్వహిస్తున్న సిబ్బంది



అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిబ్బంది

తగరపువలస: ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో వ్యవహరించి అగ్ని ప్రమాదాల నివారణకు, దేశ నిర్మాణానికి సహకరించాలని చిట్టివలస అగ్నిమాపక శాఖాధికారి జి.శ్రీనివాసరాజు సూచించారు. ఆదివారం ఆయన తాళ్లవలస అగ్నిమాపక శాల కార్యాలయం వద్ద వారోత్సవాలను జెండా ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బందితో రోల్‌కాల్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14న ముంబయి ఓడరేవులోని విక్టోరియా వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో సామాన్య ప్రజలతోపాటు 66 మంది అధికారులు మరణించి, 87 మంది గాయపడినట్టు గుర్తు చేసుకున్నారు. ఆ సంఘటనకు జ్ఞాపకార్థంగా ఏటా ఏప్రిల్ 14 నుంచి వారోత్సవాలు నిర్వహించి సమాజంలోని అన్ని వర్గాలను జాగృతం చేస్తుంటామన్నారు. విధుల్లో ప్రాణాలు కోల్పోయిన సిబ్బందికి నివాళులర్పించారు. వారం రోజులపాటు పాఠశాలలు, ఫంక్షన్ హాళ్లు, గ్యాస్ ఏజెన్సీలు, సినిమా హాళ్లు, పెట్రోల్ బంకులు, అపార్ట్‌మెంట్లు, బస్‌స్టేషన్లు, పార్కులు, ఆస్పత్రుల వద్ద అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక వస్తువులను ప్రదర్శించి, వాటి పనితీరును వివరించారు.

చిన్నాపురంలో వైఎస్సార్ సీపీ విస్తృత ప్రచారం



చిన్నాపురంలో ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళలు

పద్మనాభం: మండలంలోని చిన్నాపురంలో ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకుడు కొయ్య సత్యనారాయణ, మహిళా కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖపట్నం ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. గత ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించి కరపత్రాలు అందించారు. ప్రచారానికి మహిళల నుంచి విశేష స్పందన లభించింది.

క్రికెట్ టోర్నీ విజేత యూనియన్ బ్యాంక్ జట్టు



విజేతగా నిలిచిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టీమ్ సభ్యులు

పీఎం పాలెం : బ్యాంకర్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా పీఎం పాలెంలోని బీ క్రికెట్ గ్రౌండ్‌లో ఆదివారం యాక్సిస్ బ్యాంక్ టీమ్ – యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జట్ల మధ్య జరిగిన ఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో 27 పరుగుల తేడాతో యూబీఐ టీమ్ విజేతగా నిలిచి టోర్నీని దక్కించుకుంది. ఈ పోటీల్లో 12 బ్యాంక్‌ల జట్లు పాల్గొన్నాయి. టోర్నీ విన్నింగ్ టీమ్ కెప్టెన్ డి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ విధి నిర్వాహణలో నిత్యం తలమునకలయ్యే బ్యాంక్ సిబ్బందికి ఆటవిడుపుగా క్రికెట్ పోటీలు నిర్వహించడం సంతోషకరమని ఆనందం వ్యక్తం చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

తగరపువలస: త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి విజయరాంపురం ప్రతినిధులు ఆదివారం తగరపువలసలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉగాది పండగ రహస్యం, ఆత్మ, జీవాత్మ, పరమాత్మలను వివరించారు. ఆరు గుణాల మాయను తీసివేసి మోక్షం పొందే మార్గాన్ని తెలియజేశారు. ప్రచార కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు కె.రాజు, కె.సంతోష్‌లక్ష్మి, కె.బంగారుతల్లి, కళావతి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



తగరపువలసలో ప్రచారంలో పాల్గొన్న విజయరాంపురం ప్రతినిధులు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్



తగరపువలస కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మామిడిపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



తాళ్లవలస లిటిల్ హగ్స్‌లో అనాథ బాలలకు సరకులు అందిస్తున్న నాయకులు

తగరపువలస: భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అణగారిన వర్గాల ఆశాజ్యోతి అని పలువురు పేర్కొన్నారు. ఆయన జయంతి సందర్భంగా అంబేడ్కర్ కూడలి, కార్మికవాడలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిమ్మల ప్రసన్న ఆధ్వర్యంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కొప్పల కృష్ణ, అక్కరమాని రామునాయుడు, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, గంట్రేటి ఈశ్వరరావు, కుమార్, పందిరి విజయ్, వెంపాడ వెంకటరమణ, జీరు శ్రీనివాసరెడ్డి, తానవరపు మురళి, శిరిగిడి వెంకటరావు, బొడ్డు సాయి నివాళులర్పించారు. సంతపేటలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, కొండపేటలో ఉప్పాడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రెండో వార్డు మామిడిపాలెంలో శిల్లా వంశీ రెడ్డి, ఊడికల శ్రీరామమూర్తి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిల్ల బాబయ్యరెడ్డి, కొండపు సూరిబాబు, చేట్ల శ్రీనివాసరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, బొండా కిరణ్, పీతల రాజారావు, జీరు భరత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. తాళ్లవలస లిటిల్ హగ్స్ అనాథ బాలల కేంద్రానికి డి.కె.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో సామంతుల సత్తిరాజు, మామిడి వెంకట శివ, సోమి వెంకట్ తదితరులు బియ్యం, నిత్యావసర సరకులు, స్వీట్లు పంపిణీ చేశారు. బంగ్లామెట్టపై జరిగిన కార్యక్రమంలో సోమి అప్పలరాజు, తమ్మిన అశోక్, తదితరులు పాల్గొన్నారు. భీమిలి మండలం మజ్జివలస కూడలిలో గోపాలమిత్ర పందిరి కన్నారావు ఆధ్వర్యంలో యువకులు నివాళులర్పించారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో కానూరి రాంబాబు, అల్లు బాబూరావు, అల్లం గోవింద, చిల్ల అప్పలసూరి, మావూరి వీర్రాజు, చిల్ల నరసింహులు తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఈర్ల ఈశ్వరరావు, సిరుగుడి ఆదినారాయణ, తాలాడ పద్మనాభం, బొలె అప్పలనాయుడు, గాడు అప్పలరాజు, సుంకర నారాయణరావు, సీర సూరప్పడు, తోనంగి అప్పలనాయుడు పాల్గొన్నారు. పాండ్రంగిలో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకుడు కొత్తపల్లి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు.

రాజ్యాధికారంతోనే హక్కుల సాధన

కొమ్మాది: బహుజన రాజ్యాధికారంతోనే హక్కులు సాధించగలమని స్టీల్‌ప్లాంట్ విజిలెన్స్ ఆఫీసర్ ఎస్.కరుణరాజు అన్నారు. బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఎండాడలో అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కరుణరాజు మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం అంబేడ్కర్ శ్రమించారన్నారు. ఏఎంహెచ్‌వో ఎస్.కిషోర్, బోనుల కృష్ణమూర్తి, కె.ఫిలిప్, మంగరాజు, బండయ్య, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

భీమునిపట్నం: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అనపర్తి సూర్యప్రకాశ్, ముక్కి కృష్ణ ఆధ్వర్యంలో నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అల్లిపిల్లి నర్సింగరావు, అక్కరమాని రామునాయుడు, ఎస్.కరుణాకరరెడ్డి, వాసుపల్లి కొండబాబు, కదిరి ఎల్లాజీ, ఆర్.ప్రభాకర్‌నాయుడు, బోర నాగరాజు, జి.మధునాయుడు, బోర నాగరాజు, బోని సంజీవరావు, నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డులోని బక్కన్నపాలెంలో గల ఏపీఎస్‌పీ 16వ బెటాలియన్‌లో ఆదివారం అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని అభివర్ణించారు. కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ జి.ఇలయ సాగర్, డీఎస్పీ పి.సత్యం, తదితర అధికారులు పాల్గొన్నారు.

- స్థానిక అశోక్‌నగర్ పార్కులో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జీవీఎంసీ పారిశుధ్య కార్మికులను సత్కరించి బియ్యం, బ్యాగ్‌లు పంపిణీ చేశారు. స్థానిక నాయకులు దడాల భాస్కరరావు, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రాజేశ్వరరావు, సెక్రటరీ గౌతం పాల్గొన్నారు.
- బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, బోధకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్‌తో సామాజిక న్యాయం

ఆనందపురం : డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగంతో సమాజంలోని అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతోందని పెద్దిపాలెం సర్పంచ్ బావిశెట్టి భారతమ్మ అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో ఆదివారం ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కూరాకుల వెంకటేష్, మరుపిళ్ల చిన్నయ్య పాత్రుడు, లంకలపల్లి నానాజీ, పీవీవీ ప్రసాదరావు పట్నాయిక్, లావేటి జగన్నాథం, మరుపిళ్ల సాయిజ్ఞానేశ్వర్, మరుపిల్లి ప్రసాదరావు పాల్గొన్నారు.

- మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎన్.అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ కెల్ల రామారావు, ఏఎస్‌ఐ సత్యనారాయణ, తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

మధురవాడ: స్థానిక జోనల్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, మధురవాడ మాజీ సర్పంచ్ కుడితి రామారావు, సియాద్రి కనకరాజు, రాజాం నాయుడు, ఎంవీ రమణమూర్తి, బ్రిక్ శ్రీనివాస్, అనూష, చందు తదితరులు నివాళులర్పించారు.

- పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎస్.బాబ్జి, బెల్లాపు పాపారావు, జగన్‌మోహన్, కేవీ రమణ, తదితరులు నివాళులర్పించారు.
- విద్యుత్ శాఖ విశాఖ జోన్ – 3 కార్యాలయం వద్ద డివిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ దొర, కార్యదర్శి అనిల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈఈ పి.శ్రీనివాసరావు నివాళులర్పించారు.



సీపీఐ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మజ్జివలసలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యువకులు



పెద్దిపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మధురవాడలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పద్మనాభంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాంబాబు, తదితరులు



ఎండాడలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కరుణరాజు



మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు



బక్కన్నపాలెం పోలీస్ బెటాలియన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు